గౌరవెల్లి రిజర్వాయర్ వివరాలు

- రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం: 8.23 టీఎంసీలు
- మొత్తం భూసేకరణ 3,870.10ఎకరాలు
- మొత్తం నిర్వాసిత కుటుంబాలు: 1,122 (937+185)
- మొత్తం ఇండ్లు: 817 (693+124)
- ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణకు చెల్లించిన మొత్తం: రూ.484.76కోట్లు
- గిరిజన నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ కింద 185మందికి రూ.8లక్షలు అదనంగా చెల్లింపు.
- మొత్తం ఆయకట్టు అంచనా 1.06లక్షల ఎకరాలు(రైట్ కెనాల్ ద్వారా 90వేలు, లెఫ్ట్ కెనాల్ ద్వారా 16వేల ఎకరాలు)
- రిజర్వాయర్ కట్ట పొడవు: 10.56 కిలోమీటర్లు
- రిజర్వాయర్ కట్ట ఎత్తు: 41.62కిలోమీటర్లు
- మొత్తం రిజర్వాయర్ ఖర్చు: 1,196కోట్లు
- రిజర్వాయర్ ముంపు గ్రామాలు, తండాలు: 10 (గుడాటిపల్లి, తెనుగుపల్లి, ముద్దెలపల్లి, కొత్తపల్లి, సర్వానాయక్‌తండా, బొండ్యానాయక్‌తండా, జాలుబాయి తండా, చింతల్‌తండా, తిరుమల్‌నాయక్ తండా, సోమాజీతండా)

పెరుగుతున్న పర్యాటకులు

గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి నీళ్లు వస్తున్నాయని తెలుసుకున్న హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. నిత్యం పదులసంఖ్యలో కుటుంబాలతో సహా వచ్చి రిజర్వాయర్‌లోకి నీరు చేరుతున్న దృశ్యాలను చూసి సంబురపడుతున్నారు. ఎస్సారెస్పీ, ఎల్‌ఎండీ లాంటి డ్యాంలను చూసి మాకెప్పుడు ఇలాంటి డ్యాం వస్తుందని అనుకున్న ఈ ప్రాంత ప్రజల చెంతకే రిజర్వాయర్ రావడంపై హర్ష వ్యక్తంచేస్తున్నారు. కట్టపైకి వచ్చి కుటుంబ సభ్యులు, స్నేహితులతో సెల్ఫీలు తీసుకుంటున్నారు.

డెలివరీ సిస్టర్స్ నుంచి రిజర్వాయర్‌లోకి దుంకుతున్న గోదావరి నీళ్లు

సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషితోనే రిజర్వాయర్ పూర్తి

సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషితోనే గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తయింది. నిర్వాసితుల సమస్యలను గాని, పరిహారం చెల్లింపుల విషయంలో గానీ అడిగిన వెంటనే స్పందించి నిధులు కేటాయించడం, సమస్యలను వెంటనే పరిష్కరించారు. కొంత ఆలస్యమైనప్పటికీ రిజర్వాయర్ వందశాతం పూర్తయింది. గోదావరి నీటిని కూడా రిజర్వాయర్‌లోకి వస్తున్నాయి. రిజర్వాయర్ పూర్తికావడం హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల ప్రజల కల నెరవేరినట్లయింది. ఎన్నో ఏండ్లు వేచి చూసిన ప్రజలకు గోదావరి నీళ్లు కనిపించడంతో వారిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. రాబోయేరోజుల్లో హుస్నాబాద్ ప్రాంత ముఖచిత్రం పూర్తిగా మారిపోతుంది. కలువలు, డిస్ట్రిబ్యూటరీల పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయి. ఏదేమైనా రిజర్వాయర్ పూర్తయ్యేందుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌తోపాటు అధికారులకూ ధన్యవాదాలు.

– వొడితెల సతీశ్‌కుమార్, ఎమ్మెల్యే హుస్నాబాద్

గోదారమ్మతో.. గౌరవెల్లి రిజర్వాయర్‌తో తీరనున్న మెట్ట రైతుల కష్టాలు

మెట్ట ప్రాంతానికి జీవం

వరద కాలువను జీవకాలువగా మార్చిన సీఎం కేసీఆర్

- నెర్రెలువారిన భూముల గొంతు తడుపుతున్న గోదావరి నీళ్లు
- హుస్నాబాద్ నియోజకవర్గంలో 1.06లక్షల ఎకరాలకు సాగునీరు
- రిజర్వాయర్ వద్ద పెరిగిన పర్యాటకుల సందడి
- ఇక మూడు పంటలు పండించుకోవచ్చంటున్న రైతులు
- రిజర్వాయర్ పూర్తయ్యేందుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌కు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కృతజ్ఞతలు
- దశాబ్దాల కలను నెరవేర్చిన సీఎం కేసీఆర్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటామన్న కర్షకులు

డెలివరీ సిస్టర్స్ నుంచి రిజర్వాయర్‌లోకి దుంకుతున్న గోదావరి నీళ్లు

హుస్నాబాద్, జూలై 3: దశాబ్దాలుగా మెట్ట ప్రాంత ప్రజలు కంటున్న కల ఎట్టకేలకు నెరవేరింది. గోదావరి నీళ్ల వస్తాయి మా నెరైలువారిన భూములు గొంతులు తడుపుతాయి అని ఎదురుచూసిన రైతుల నిరీక్షణ ఫలించింది. దాదాపు ఐదు దశాబ్దాలుగా వరద కాలువ కోసం ఎదురుచూసిన హుస్నాబాద్ మెట్ట ప్రాంత ప్రజల కలలను గౌరవెల్లి రిజర్వాయర్‌ను నిర్మించి సీఎం కేసీఆర్ నిజం చేసి చూపించారు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో నూతనోత్సాహం వచ్చినట్లయింది. ఒకప్పుడు గుక్కెడు నీటికి అల్లాడిన జనానికి ఒక్కసారిగా గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తయి అందులోకి భారీ మోటర్లు నీళ్ల పోస్తుండటంతో ఆనందంతో ఉక్కిబిక్కిరవుతున్నారు. ఇక మన కష్టాలు తీరినట్లేనని, తమకున్న భూమిలో బంగారం పండించొచ్చని అంచనాలు వేసుకుంటున్నారు. రిజర్వాయర్‌లోకి నీళ్లు వస్తున్నాయని తెలుసుకున్న రైతులు, సాధారణ ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి రిజర్వాయర్‌ను ప్రత్యక్షంగా చూస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది.

2014కు ముందు రిజర్వాయర్ పరిస్థితి

2007 సెప్టెంబర్ 9న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి గౌరవెల్లి రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారు. 2009లో రిజర్వాయర్ కట్టపనులతోపాటు కుడికాలువ పనులను కూడా మొదలుపెట్టారు. 1,814 ఎకరాలకు రూ.2.10లక్షల చొప్పున పరిహారం కూడా అందజేశారు. 693ఇండ్లకు పరిహారం అందింది. నిర్వాసిత కుటుంబాలైన 937 కుటుంబాల్లో కొందరికి మాత్రమే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందింది. కేవలం 1.24 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌కు రూపకల్పన చేశారు. కట్ట పనులు సగం వరకు కూడా పూర్తి కాలేదు. 2011నుంచి టన్నెల్‌తోపాటు కట్ట పనులు కూడా నిలిచిపోయాయి. పరిహారం కోసం, ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ కోసం నిర్వాసితులు పెద్దఎత్తున ఉద్యమాలు చేసినా ఎవరూ పట్టించుకోలేదు.

2014 తర్వాత రిజర్వాయర్ పరిస్థితి

2014లో తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చిన ఏడాదికి అంటే 2015 ఏప్రిల్ 13న సీఎం కేసీఆర్ స్వయంగా గౌరవెల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. రిజర్వాయర్ సామర్థ్యం పెంచుకునేందుకు అనుకూలంగా ఉండడంతో 8.23 టీఎంసీలకు పెంచుతూ ప్రకటన చేశారు. మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే గౌరవెల్లి రిజర్వాయర్‌ను కుర్చీ వేసుకొని పూర్తి చేస్తానని ఈ ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. వెంటనే పనులు షురువయ్యాయి. అదనంగా 2,030ఎకరాల భూసేకరణ, అదనంగా 185 నిర్వాసిత కుటుంబాలను గుర్తించి.. కేవలం రెండు నుంచి మూడేండ్లలో చెల్లింపులు సైతం చేయించారు. పాత 937 నిర్వాసిత కుటుంబాలతోపాటు 185 నిర్వాసిత కుటుంబాలకు రూ.8 లక్షల చొప్పున ఆర్‌అండ్ ప్యాకేజీ అందజేశారు. ఇందులో సుమారు 60మంది వరకు ప్యాకేజీ తీసుకోకుండా కోర్టుకు వెళ్లారు. అయినా గడిచిన ఏడాది కాలంగా పనులను ముమ్మరంచేసి మొత్తం మీద రిజర్వాయర్‌ను పూర్తి చేసి సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. దీంతో హుస్నాబాద్ నియోజకవర్గంలో 1.06 లక్షల ఎకరాలకు సాగునీరందనుంది.

రిజర్వాయర్ పంపుహౌస్, టన్నెల్ వివరాలు

- బెజ్జంకి మండలం తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్ నుంచి 24కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, టన్నెల్ నిర్మాణం జరిగింది.
- ఇందులో 12కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, 12కిలోమీటర్ల సొరంగ మార్గం(టన్నెల్) నిర్మాణం జరిగింది.
- పంపుహౌలీలో 32 మెగావాట్ల సామర్థ్యం గల 3 భారీ మోటర్లు బిగింపు
- ప్రత్యేకంగా 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం
- 50ఎంవీఏ సామర్థ్యం గల 5 భారీ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- కెనాల్, టన్నెల్, పంపుహౌస్ నిర్మాణ వ్యయం మొత్తం రూ.1,012కోట్లు

పంపుహౌస్‌లోని భారీ మోటర్ల నుంచి రిజర్వాయర్‌లో చేరిన నీరు

పంపుహౌస్ డెలివరీ సిస్టర్స్ వద్ద పర్యాటకుల సందడి

రిజర్వాయర్ కట్టపై గ్రాస్ నాటుతున్న కూలీలు

వరద కాలువ కాదు.. జీవ కాలువ

ఐదు దశాబ్దాల క్రితం ఎత్తిపోతల పథకం చేపట్టి మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్‌కు నీళ్తివ్వాలని అప్పటి వామపక్ష పార్టీలు, పలు సంస్థల నాయకులు ప్రభుత్వానికి విన్నపాలు చేశారు. పలుమార్లు పెద్దఎత్తున ఉద్యమాలు సైతం నిర్వహించారు. చంద్రబాబు హయాంలో వరద కాలువ పేరుతో ఓ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దీనిప్రకారం ఎస్సారెస్పీ పూర్తిగా నిండిన తర్వాత బ్యాక్‌వాటర్‌ను కెనాల్ ద్వారా మిడ్ మానేరుకు చేర్చి అక్కడి నుంచి తోటపల్లి(ఓగులాపూర్) రిజర్వాయర్‌లో పోయించి ఆ తర్వాత టన్నెల్ ద్వారా గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి నీరు ఎత్తిపోయాల్సి ఉంటుంది. వరద కాలువ పనులు షురవయినప్పటికీ కొన్ని కారణాల వల్ల మళ్లీ ఆగిపోయాయి. కేవలం వరదలు వచ్చినప్పుడు, ఎస్సారెస్పీ పూర్తిగా నిండినప్పుడు మాత్రమే మిడ్‌మానేరు, గౌరవెల్లి తదితర ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చే విధంగా అప్పుడు రూపకల్పన చేశారు. దీనిపై మెట్ట ప్రాంతంలోని మేధావులు, నిపుణులు తీవ్రంగా వ్యతిరేకించారు. 2014 తర్వాత సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. కాళేశ్వరంతోపాటు ఎల్లంబల్లి రిజర్వాయర్‌ను మిడ్‌మానేరును అనుసంధానం చేయడంతో వరద కాలువ జీవకాలువగా మారినట్లయింది. ఓగులాపూర్ వద్ద ఆన్‌లైన్ రిజర్వాయర్ చేపట్టాలని అప్పటి ప్రభుత్వం 401ఎకరాల భూసేకరణ చేసింది. ఇది అదనపు ఖర్చుగా భావించి తోటపల్లి చెరువును ఆన్‌లైన్ రిజర్వాయర్‌గా మార్చి వేసి అక్కడి నుంచి గ్రావిటీ, టన్నెల్ ద్వారా నిరంతరం గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి నీళ్లు వచ్చే విధంగా సీఎం కేసీఆర్ రూపకల్పన చేశారు.

చూస్తుంటే సంబురంగుంది..

హుస్నాబాద్ రూరల్: గౌరవెల్లి ప్రాజెక్టులోకి గోదావరి జలాలు రావడం చూస్తుంటే సంబరంగుంది. ఎన్నో ఏండ్లుగా ఈ ప్రాంత రైతుల చిరకాల కలను నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కింది. తెలంగాణ రాక ముందు మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టితో పూర్తయింది. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీష్ కుమార్‌కు ఈ ప్రాంత రైతులు ఎప్పటికీ రుణపడి ఉంటారు. ఇకపై రైతులు మూడు పంటలు పండించుకోవచ్చు.

– పాన్నబోయిన శ్రీనివాస్, రైతు, మీర్జాపూర్

గౌరవెల్లితో గోస తీరింది..

హుస్నాబాద్ రూరల్: గౌరవెల్లి ప్రాజెక్టుతో రైతుల గోస తీరింది. దశాబ్దాల నాటి కల కూడా నెరవేరింది. గోదావరి జలాలతో హుస్నాబాద్ ప్రాంతం సస్యశ్యామలకానుంది. ప్రాజెక్టులో నీళ్లను చూస్తామో లేదో అనే ఓ రందీ కూడా ఉండేది. ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలను ఇక్కడికి తీసుకొచ్చింది. ప్రాజెక్టు, పంప్‌హౌస్, సొరంగం చూస్తే చాలా సంతోషం అనిపించింది. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మించి ఇక్కడి ప్రజల గోస తీర్చిన సీఎం కేసీఆర్‌కు మా ధన్యవాదాలు.

– వేల్పుల రాజయ్య, రైతు, మీర్జాపూర్

మూడు పంటలు పండిస్తం...

అక్కన్నపేట: సీఎం కేసీఆర్ గోదావరి జలాలను తీసుకొచ్చి హుస్నాబాద్ మెట్ట ప్రాంతానికి జీవం పోశారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ లోకి నీళ్లను చూస్తేంటే సంబురమవుతుంది. ప్రాజెక్ట్ కిందనే మా భూములు ఇక నుంచి మూడు పంటలు పండుతాయి. పుష్కలంగా కరెంటు, నీళ్లు, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఇక అన్ని రకాల పంటలూ సాగు చేస్తాం. గత పాలకులు ఈ ప్రాంతాన్ని పట్టించుకున్న పాపానపోలేదు. ఎనిమిదేండ్లుగా ఈ ప్రాజెక్ట్ పనులు ఆగిపోయాయి. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి గోదావరి జలాలను తీసుకొచ్చింది. సీఎం కేసీఆర్, మంత్రి తన్నీరు హరీశ్‌రావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌కు మా రైతుల పక్షాన ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్తున్నాం.

– పెండెల బాలకొమురయ్య, రైతు, గోవర్ధనగిరి

సంగారెడ్డి జిల్లా వెలిమెల గ్రామ ఎస్సీలకు ధరణి పాస్‌బుక్కులు అందజేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు (ఫైల్)

బతికుండగా పాస్‌బుక్కులు చూస్తమనుకోలేదు..

నలభై ఏండ్ల నాటి కల సాకారమైంది.. ధరణితో మా కష్టాలు తీరాయి

- మోకాళ్లో ఉండి పాస్‌బుక్కులు లేని పరిస్థితి..
- ఇన్నేండ్లు రైతుబంధు, రైతుబీమా పథకాలకు దూరం..
- సీఎం కేసీఆర్ సర్కార్ మాసమస్యను పరిష్కరించి పాస్‌బుక్కులు ఇచ్చింది..
- ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం..
- వెలిమెల, కొండకల్ శివారు భూవివాదం పరిష్కరించి ధరణిలో పేర్లు ఎక్కించాం: తహసీల్దార్ జయరామ్

రామచంద్రాపురం, జూలై 3: ధరణి పోర్టల్ భూబాధితుల సమస్యను పరిష్కరిస్తుంది. ధరణితో భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, నాలా కన్వర్షన్లు, పేరు మార్పిడీ తదితర పనులు తహసీల్దార్ స్థాయిలోనే వెంటవెంటనే అయిపోతున్నాయి. గతంలో భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలంటే జిల్లాకేంద్రంలోని రిజిస్ట్రర్ కార్యాలయానికి వెళ్లి అక్కడ గంటలతరబడి నిరీక్షించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి వచ్చేంది. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత మ్యుటేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ వెహ్సులరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఇవ్వన్నీ గమనించిన సీఎం కేసీఆర్ భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు పారదర్శకంగా జరగాలని, పేదలందరికీ న్యాయం జరగాలని ఆలోచన చేసి ధరణికి శ్రీకారం చుట్టారు. తహసీల్దార్‌లకే భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, నాలా కన్వర్షన్, పేర్ల మార్పిడీ వంటివి అప్పగించడంతో ఇప్పుడు అందరికీ ఎంతో మేలు జరుగుతుంది. భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి మీ సేవలో స్లాట్ బుక్ చేసుకొని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి అరగంటలో రిజిస్ట్రేషన్ జరగడంతోపాటు ఐదు నిమిషాల్లో మ్యుటేషన్ చేసుకొని సంతోషంగా వెళ్తున్నారు. గతంలో మారిదిగా నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పనిలేదు.బోర్లగుట్ట ఆశ్రయించాల్సిన పనిలేదు.లంచం ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రతి భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ధరణిలో పారదర్శకంగా జరుగుతుంది. ఎన్నో ఏండ్లుగా ఉన్న భూసమస్యలు ధరణి రావడంతో పరిష్కారమయ్యాయి. అందుకు నిదర్శనం తెల్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామానికి చెందిన ఎస్సీ రైతులే. నలభై ఏండ్లుగా రైతులు వారికి సంబంధించిన అసైండ్ భూమిలో పొజిషన్‌లో ఉన్నప్పటికీ వారి పాస్ బుక్కులు లేవు. దీంతో రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న రైతు బంధు, రైతుబీమా వారికి అందలేదు. నలభైఏండ్ల నాటి సమస్యకు బీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కారంచూపడంతో రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

57మంది రైతులకు ధరణి పాస్‌బుక్కులు

తెల్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామంలోని సర్వేనం బర్ 434లో 1980 నుంచి 1992 వరకు భూమిలేని ఎస్సీ నిరుపేదలకు అసైన్‌మెంట్ పట్టాలిచ్చినను అప్పటి ప్రభుత్వాలు ఇచ్చాయి. కానీ పాస్‌బుక్కులు రాలేదు. వెలిమెల గ్రామానికి పక్కనే ఉన్న రంగారెడ్డి జిల్లా కొండకల్ గ్రామానికి మధ్య శివారు భూవివాదం ఉండడంతో ఎస్సీలకు ఇచ్చిన భూములు తమవంటూ ఆ గ్రామస్థులు ఆ భూములోకి ఎస్సీ రైతులను రానిచ్చే వారు కాదు. ఇలా కొన్నిఏండ్లుగా రెండు గ్రామాల మధ్య భూవివాదం కొనసాగుతుంది. అందులో కొందరు రైతులు మరణించడంతో వారి వారసులు ఉన్నారు. ఇన్నేండ్లు భూవివాదం కారణంగా రైతులకు పాస్ బుక్కులు లేకపోవడంతో రైతుబంధు, రైతుబీమా వారికి రాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి భూబాధితుల సమస్యను పరిష్కరించేందుకు క్రమించారు. పలుమార్లు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడి రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లకు భూసమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీచేయడంతో రెండు గ్రామాల మధ్య ఉన్న భూవివాదాన్ని పరిష్కరించేందుకు రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో జాయింట్ భూసర్వేను నిర్వహించారు. దీంతో 434లో పొజిషన్‌లో ఉన్న 57మంది రైతులకు మేలు జరిగింది. తహసీల్దార్ జయరాం నేతృత్వంలో వారందరి పేర్లను ధరణిలో ఎక్కించి వారికి ధరణి పాస్‌బుక్కులను అందజేశారు. నలభై ఏండ్ల తర్వాత వారి భూములకు ధరణి పాస్‌బుక్స్ రావడంతో వెలిమెల ఎస్సీ రైతులు ఎంతో సంబురపడ్డారు. ఇన్నేండ్లకు మా భూములకు సంబంధించి పాస్‌బుక్కులను చూస్తున్నామంటే అది కేసీఆర్ సర్కారు పుణ్యమేనని రైతులు పేర్కొంటున్నారు.

బతికుండగా పాస్‌బుక్కు వస్తదనుకోలేదు

బతికుండగా పాస్‌బుక్కులు వస్తదనుకోలేదు. నలభై ఏండ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వెలిమెల గ్రామంలో మా కుటుంబానికి దున్నుకోవడానికి భూమిని కేటాయించింది. పక్కనే ఉన్న కొండకల్ ఊరోళ్లు.. ఆ భూమి మాదంటూ మమ్మల్ని ఆ భూమిలోకి పోనిచ్చుటోళ్లు కాకుండే. మా భూమిని దక్కించుకోవడానికి చాలా తిప్పలుపడ్డం. ఎన్నో ప్రభుత్వాలు మారాయి కానీ.. మా రాత మాత్రం మారలేదు. పాస్‌బుక్కులు లేకపోవడంతో సీఎం కేసీఆర్ రైతులకు ఇస్తున్న రైతుబంధు మాకు అందలేదు. ఇన్నేండ్లకు కేసీఆర్ సర్కారు మా సమస్యను పరిష్కరించి ధరణి పాస్‌బుక్కులు ఇచ్చింది. మా భూమి మాకు దక్కడంతో చాలా ధైర్యం వచ్చింది.

– లలిత, వెలిమెల గ్రామం

ఎస్సీ రైతులకు మేలు జరిగింది..

వెలిమెల, కొండకల్ గ్రామాల మధ్య భూవివాదం ఉండడంతో ఇన్నేండ్లు రైతులు వారి భూములోకి వెళ్లి వ్యవసాయం చేసుకోలేని పరిస్థితి. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు జిల్లాల ఆర్డీవోలు, జిల్లా సర్వే టీంలతో కలిసి సంయుక్తంగా సర్వేనంబర్ 434లోని భూమిని సర్వే చేసి 57మంది రైతు కుటుంబాలకు మేలు చేశారు. నలభై ఏండ్ల క్రితం రైతులకు అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చినప్పటికీ వివాదం కారణంగా పాస్ బుక్కులు ఇవ్వలేదు. సర్వే ఆధారంగా ఆయా భూములను మా పరిధిలోకి తీసుకొని ఎస్సీ రైతుల పేర్లను ధరణిలో పొందుపర్చి అందరికీ పాస్‌బుక్కులను అందజేశాం. ఇకసంబంధిత రైతుబంధు, రైతుబీమా పథకాలు వర్తిస్తాయి. ధరణితో భూమి రిజిస్ట్రేషన్, ఆ వెంటనే మ్యుటేషన్ చేస్తున్నాం. నాలా కన్వర్షన్ కూడా ప్రభుత్వం తహసీల్దార్‌లకే అప్పగించింది. ధరణి రాకతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా, రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద పడిగాపులు పడకుండా సులభంగా, వేగంగా తహసీల్దార్ వద్దే రిజిస్ట్రేషన్ చేయించుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది.

– తహసీల్దార్ జయరామ్